ఎర్రగుంట్లలో 'రాయలసీమ' దిగగానే యెదురుగ్గా సి. సి. ఐ. సిమెంటు ఫ్యాక్టరీ. చిలమకూరులో బస్సు దిగగానే రోడ్డుమీద, రోడ్డు కటూ యిటూ కోరమాండల్ వాళ్ళు కడుతున్న మరొక కొత్త సిమెంట్ ఫ్యాక్టరీ హడావిడి.

జీపుల మొగం, కార్ల మొగం పెద్దగా చూడని చిలమకూరు రోడ్డుమీద యిప్పుడు జీపులు, కార్లు అదేపనిగా అటూ యిటూ తిరుగుతున్నాయి. ఫ్యాక్టరీ కట్టే చోటుకు రాళ్ళు తీసుకుపోతూ గతుకుల రోడ్డుమీద లారీలు. లారీల్లో ఆ రాళ్ళలాగే ఆడా మగా.

రోడ్డు పక్కల కొత్త అంగళ్ళు. చార్మినారు, సిజరు తప్ప మొన్న మొన్నటి దాకా మరే రకం సిగరెట్లు దొరకని అంగళ్ళలో రెడ్‌విల్స్ దాకా రకాలు కనపడుతున్నాయి. బ్రాందీ షాపులే యింకా వచ్చినట్లు లేదు. కూరగాయలు, సరుకులు, తినుబండారాలు, టీలు, కాఫీలు, గుడ్డలు, సబ్బులూ, పేస్టూ కలగాపులగంగా ఒకే అంగట్లో, వేరువేరు అంగళ్ళలో.

నమ్ముకున్న నేల

కేతు విశ్వనాథరెడ్డి

బస్సుల కోసం వచ్చిన వాళ్ళతో. రికామీ మనుషులతో. ఫ్యాక్టరీ కూలీ జనంతో సంబంధమున్న వాళ్ళతో రోడ్డు సందడిగా వుంది. ఇన్నేళ్ళ వ్యవసాయమూ వానమీద ఆధారపడిన వాణిజ్య పంటలూ. రాళ్ళ గనుల వ్యాపారమూ తేలేని కొత్త మార్పులు యిప్పుడు కనపడుతున్నాయి. గ్రామీణ బ్యాంకి యీ మార్పుల మధ్య. రెండు మూడు భాషల జనం యీ మార్పుల మధ్య.

రోడ్డు మీద మావూరి వాళ్ళెవరూ కనపడలేదు. రోడ్డు దిగి మావూరి కాలి దారి చేలగుండా వెళ్ళే కాలిదారి పట్టినా.

చుట్టూ చేలు. నూర్ల యెకరాల చేలు. యెవరెవరి చేతుల్లోనో మారుతూ వస్తున్న 'పుడమితల్లి'. అమ్మకాల్లో కుటుంబ వం కాల్లో చీలికలూ ముక్కలూ అవుతూ 'నేల తల్లి', గట్లమధ్య' బూదేవత.'

సేద్యాలు ఆయికూడా చాలా మటుకు విత్తనం పడకుండా.... దాదాపు చేలన్నీ బీళ్ళే. బీళ్ళన్నీ ఆకాశాన్ని కరువున పడి చూస్తూ.... 'బీళ్ళుదున్నేరు.' వాన లేదు. పంట లేదు.

పొలంలో జొన్నెగిలి లేదు. కొర్రేగిలి లేదు. కుసుమేగిలి లేదు వెనక్కాయేగిలి లేదు. యే యేగిలీ యేం లాభం? అక్కడో. యిక్కడో బెత్తెడెత్తు కూడా పెరక్కుండానే పసివాళ్ళ చావులాగ మాడి బుగ్గి అయిన వెనక్కాయ. యీ పాటికి యే రెండు మూడు వానలో అదును తప్పకుండా పడివుంటే గట్లు క
కుండా పైరు పచ్చలతో
ల్సిన పొలాలు. గట్లు వ
తున్నాయి— వాళ్ళ (
ష్యత్తులా!

మళ్ళా కరువే. కర
భాగమైన కరువు. యెన
లేదు. గుర్తులు సమస్య

భూమి, కొంపా, గో
వీధిలా వుంది. పైన
కుప్పలాగా ఆకాశంలో
మబ్బులేవో కనపడుతున్నాయి.

వానల్లేక గాలికీ, యెండలకీ పగిలిన పత్తికాయల్లో కనపడే గొగ్గి పత్తిలాగా ఆ మబ్బులు. ఆకాశంలో ఒక్క కాకి లేదు కాలి దారిలో ఒక్క మనిషి యెదురుపడలేదు. పైరుగాలి రావలసిన కాలంలో,గాలి కాలంలో లాగా గాలి.

ఈ యేడాది కరువు యింత దారుణంగా వుంటుందనుకోలేదు. న్యూసు పేపర్లలో చదివిన వార్తలూ. యెవరెవరో చేసిన ప్రకటనలూ,వాగ్దానాలూ జ్ఞాపకానికి వచ్చినాయి. తెలిసి తెలిసినప్పటినుంచీ ప్రకటనల్లో, వాగ్దానాల్లో మార్పుమాత్రం చూళ్లేదు.

ఇంత ఘోరకలిలో హైదరాబాద్ నుంచీ నేనేం పాముకోను యింత దూరం యిక్కడికి వచ్చినట్లు? అంగడి సుబ్బరాయుడు వుత్తరం రాస్తానే యింత దూరం పరుగెత్తుకొని రావాలా?ఆశ.... అవసరం...

పిత్రార్జితంగా మిగిలిన రెండెకరాల తోటను, నాలుగేండ్ల కిందట మా దాయాది వీరన్నకు అమ్మడంతో నా కింకా వదలని మావూరి బంధం;భూమితో ఆఖరి బంధం. ఈ రెండు మూడు రోజుల్లో పనికుదిరితే ఈ నేలతో నాకు తెగతెంపులు.

నాలుగేండ్ల కిందట వీరన్న తన తోట పక్క వుండే నా రెండెకరాల భూమినీ తానే తీసుకుంటానన్నాడు. ఆ వంతుల బావికింద వున్న నా తోటను మరొకరికి అమ్మి,వీరన్న గుండెలమీద కుంపటి పెట్టే
నికంటే, వీరన్నకే అమ్మడం మంచి
న్న వెలిపొలం నాలుగు
వాళ్ళ

రకాలు కనప
గాయలు, సరుక
పేస్టూ కలగాపుల
నమ్ముకున్న నే
కేతు విశ్వనా

రార
భూమి

కోసం వచ్చిన వాళ్ళతో. యేగిరి డబ్బు
ఆలో. ఫ్యాక్టరీ కూలీ ఆ...మ్మ యి
ప్రసూన ...ంది. వీరన్నకు రాస్తే జవాబు లేదు,మామూలు సమయంలో పోదాం అనుకుంటున్నాను. యింతలో అంగడి సుబ్బరాయుడు నుంచీ వుత్తరం. వీరన్న వ్యవసాయం యెత్తిపెట్టినాడంట. తోట అమ్మినాడంట. చెడిపోయి నాడంట.

నా రెండెకరాలు సుబ్బారాయుడు కొంటా డంట.

వుత్తరంలో వివరాలు లేవు. అంతా బీరకాయ్ల పీచులాగా వుంది.వీరన్న నిమ్మ చెల్లేమైంది తెలియదు. అమ్మింది యెందు కయింది తెలియదు. దెబ్బతిన్న సంసారమే అయినా యింత యిదిగా వుంటుం దనుకో లేదు.

వుత్తరం చూసి నా భార్య తొందర పెట్టింది. అసలే ఆడకూతురు. యిది చిక్కు వ్యవహారమని ఒక వైపు యిబ్బందిగా వుంది. గుత్త బాకీ చెల్లేసుకున్నా వీరన్న సంచకారం నా దగ్గర వెయ్యికి పైగా వుంటుంది. అసలు వీరన్న భూమి వదులుకుంటాడా? సంచకారం వెనక్కు తీసుకుంటాడా? వెనక్కు తీసుకోమని నా నోటితో నేనెట్లా అడగడం? మరి నా అవసరం? అయితే ఈ కరువు రోజుల్లో నా అవసరం తీరేదెట్లా?అంగడి సుబ్బరాయుడి యెత్తులేమో?

మనసంతా చీకాగ్గా వుంది. వూరు దగ్గిరపడింది. చిన్నప్పుడు వానాకాలంలో, పైర్ల కాలంలో తిరిగిన పొలాలూ,కుంటా, కొండా జ్ఞాపకం వస్తున్నాయి.మమకారాలు ఒకంతట వదలవు, కరువుల ప్రాంతంలో భూముల ధరలు పెద్దగా పెరిగి చావవని తెలిసీ, యెన్నేళ్ళు భూమి అమ్మకుండా వాయిదావేసినాను? యేదో జీతం డబ్బులతో బతకడం బట్టి యిది నాకు సాధ్యమయిందేమో! చదువే లేకపోతే, వుద్యోగమే లేకపోతే యిట్లాంటి చోట నేనేమై వుండే వాణ్ణి? ఆలోచించడానికి భయం వేసింది.

వూరు గవిని లోవున్న వేపచెట్టు కింద చెట్టు చుట్టూకట్టిన అరుగుమీద యెప్పుడూ కనిపించే పుల్లయ్య కనపడలేదు. ఆ ముసిలోడు జీతాలోళ్ళమీద విసుర్లు విసురుతాడు. వూపిరి పీల్చుకున్నాను. ఆ అరుగు మీద మామూలుగా వుండే మా వూరి సగం సంఘజీవితం కనపడలేదు.నా చిన్నతనంలో అక్కడే మొకులూ, వగ్గాలు పేనే వాళ్ళు. బయట నుంచీ వచ్చిన సరుకుల బండ్లమీద ఆడవాళ్ళూ, పిల్లలూ యెగబడే వాళ్ళు- చేటలు చేటలు గింజలు వెంట తెచ్చుకుని. పిల్లలు బొంగరాలు ఆడేవాళ్ళు. పుట్టచెండు ఆడేవాళ్ళు. రాత్రుళ్ళు పొద్దుపోయిందాకా పిల్లలం కథలు చెప్పించుకునే వాళ్ళం. చెప్పుకునే వాళ్ళం. కథలు చెప్పే యెరికలయ్య అబ్బ చచ్చిపోయి నాడంట.

మిగతా నా సావాసగాళ్ళు అంతా భూమిని నమ్ముకున్న వాళ్ళు. యెట్లెట్లున్నారో; నాలుగేండ్లయింది చూచి. కొందరైనా ఈ సమయంలో అరుగుమీద కనపడే వాళ్ళు. యిప్పుడు యిద్దరు కుర్రవాళ్ళు ఝుట్కాచార్టు చూస్తున్నారు. వాళ్ళెవరి పిల్లలో నాకు జ్ఞాపకం రాలేదు. వాళ్ళు నన్ను గుర్తించలేదు. రెండేండ్లకో, మూడేండ్లకో చుట్టపు చూపుగావచ్చే నన్ను యెవరు గుర్తిస్తారు? వూరు విడిచి యిరవై యేండ్లు పైబడింది.

వూరి మధ్య దేవళం దగ్గర మామూలుగా కనపడే మిగతా సగం మా వూరి సంఘం కనపడలేదు. అక్కడే ఒకప్పుడు వేమన్నలూ, సాధులూ, సన్యాసులూ, తత్వాలవాళ్ళూ, దొమ్మరాట, తోలుబొమ్మలాటల వాళ్ళూ దిగేవాళ్ళు. పౌరాణిక నాటకాలు నేర్చుకునే వాళ్ళు- కొన్నేళ్ళు బడి దేవళంలోనే. దేవళం ముందర యాటపోతులు తెగేవి. వానకోసం కప్పల పెళ్ళిళ్ళ ప్రారంభం అక్కడే. విరాటపర్వం చదవటం అక్కడే. భజనలు అక్కడే. శ్రీరామనవమి పానకాల పంపకం అక్కడే. మొలకల పున్నమి మొదులు కావడం అక్కడే. గిలకల కొట్లాటలు అక్కడే. వూళ్ళోకి వచ్చే కొత్తవాళ్ళ పలకరింపులు అక్కడే.అక్కడే రెడ్డీ, రెవెన్యూవాళ్ళు దిగేవాళ్ళు. అక్కడే నా చిన్నతనంలో కాశీనాధుని ఆంధ్రపత్రిక వాకరు చదువుతావుంటే నలుగురూ చేరి వినడం చూసినాను. వాళ్ళ చర్చలు విన్నాను. యస్సెల్సీ చదువుకొనే రోజుల్లో కాంగ్రెస్ రాజకీయాలూ, కమ్యూనిస్టు రాజకీయాలు విన్నాను.స్వాతంత్రం వచ్చిన రోజు జెండా నాటడానికి కట్టిన రాళ్ళ దిమ్మెమీద పెట్టేందుకు తొలిచిన బండ మాత్రం పక్కన పడివుంది- పాడుబడి పోతున్న దేవళం లాగే.

పైరు కాలంలో యెవరెవరి చేలల్లో పంటయెట్లా పండింది చర్చలు సాగేవి. చేలల్లో పడిన పశువుల పంచాయితీలు



అక్కడే. దొంగలకు శిక్షలు అక్కడే. వూరు మంచీ, వూరు చెడ్డా అక్కడే. మా నాయన మంగళైతె అది ముప్ఫయి యెకరాలూ, యిల్లూ పోగొట్టింది ఈ దేవళం లోనే.

ఆ దేవళంలో కూర్చొనివున్న కుర్రవాడెవరో "ఈ పొద్దు పేపరు తెచ్చినారా" అన్నాడు.

"యెవరి పేపరు?" అన్నాను.

యిబ్బందిగా "ఈ వూళ్ళో పేపరు తెచ్చుకొనేదెవరు? మీరేమన్నా కొనుక్కొని వచ్చినారేమో" అన్నాడు.

"విన్నటి తెలుగు పేపరుంది" అన్నాను.

"అదే యీండి" అవి తీసుకున్నాడు.

యిది వార్తల దాహమా, చదువుకున్న వాడి చదువాకలో అర్థం కాలేదు. వీధిలో సంచలనం లేదు.

యిప్పుడు వూరు వూరంతా వలస పోయినట్లుంది. పిల్లలు తప్ప యింటి ముందర అరుగులమీద కూడా పెద్దవాళ్ళు కనపడలేదు. వూరు యింతగా మారిపోవాలా? యే వుత్సాహమూలేక యిళ్ళల్లో ముడుచుకొని కూర్చుని వుంటారేమో. వానలేని యిట్లాంటి రోజుల్లో మూథనమ్మకాల ద్వారా కనపడే సంఘజీవితం కూడా కనపడడం లేదు.

వీరన్న యింట్లో లేదు. వీరన్న భార్య రామలక్షుమ్మ జొన్న బియ్యం విసురుకుంటోంది. నన్ను చూసి బిత్తరపోయింది. గబగబా లోపలికెళ్ళి కాళ్ళకు కడుక్కోను నీళ్ళిచ్చింది. జగితిమీద నులకమంచం వాల్చి, దానిమీద ఒక చిరుగుల పరుపు పరచి కూచోమంది. కూర్చున్నాను.

రామలక్షుమ్మ కుశలప్రశ్నలు వేసింది. యింట్లో పరిస్థితులు చూస్తూ జవాబులు గొణిగినాను.

"ఇప్పుదేవచ్చా(వస్తా)బావా" అంటూ రామలక్షుమ్మ బయటికి వెళ్ళింది. యిల్లు రైతిల్లులాగా లేదు. యే స్కూలు టీచరుకో అద్దెకిచ్చిన యిల్లులాగా వుంది గాటిపాట యెద్దులు లేవు. యారముట్లు లేవు. యెనుములు లేవు.అటకమీద పొట్టూ లేదు, చొప్పాలేదు. ఒకటి రెండు కోళ్ళు మాత్రం తిరుగుతున్నాయి. అంగడి సుబ్బరాయుడు రాసింది నిజమేనని తేలుతుంది. వీరన్న వ్యవసాయం యెత్తిపెట్టినట్లే.

రామలక్షుమ్మ కొంగు చాటున యేదో దాచుకుని వచ్చింది. "కాఫీ తెచ్చా(తెస్తా) నుండు బావా" అని గాట్లో వేసిన పుల్లలు తీసుకొని లోపలికెళ్ళింది. అరగంట తర్వాత కాఫీ తెచ్చియిచ్చింది. బెల్లం కాఫీ. పొగ వాసన. ఆమెపడిన అవస్థ అర్థమైంది.

"వీరన్న వూళ్ళో లేడా" అని అడిగాను.

రామలక్షుమ్మ కాసేపు మాట్లాడలేదు. చెప్పక తప్పలేదన్నట్లు మాటలు మింగుతూ చెప్పింది।

"పొద్దుటూర్నుంచీ వచ్చినాక సిమెంటు ఫ్యాక్టరీకి పోతండాడు, మనూర్లో చానా మంది పోతండారు యీ నడమ; సెపితే తీరదులే బావా."

ఆమె కంఠంలో జీరపడింది. మరో ప్రశ్న వేయలేదు. కానీ ప్రొద్దుటూరి నుంచీ రావడమేమిటో నాకర్థం కాలేదు. వీరన్న వచ్చినాక తీరిగ్గా అడగవచ్చులే అనుకున్నాను.

"నీళ్ళు కాంచుతా బావా. పొంతలో నీళ్ళు అయిపోయినాయి. తెచ్చా (తెస్తా) వుండు".

—రామలక్షుమ్మ బిందె తీసుకొని బయటికి వెళ్ళబోతోంది.

"నేను అట్లా వూర్లోకి పొయ్యొస్తా నాకన్నం, గిన్నం వండద్దులే" ఆమె వుండమని బలవంతం చేస్తుందని, విన్పించుకోకుండా బయటపడినా.

అప్పటికి యింకా పది గంటలు కాలేదు. సాయంత్రంగానీ వీరన్న రాడు. యీ పరిస్థితుల్లో యెవరింటికి పోవాలన్నా బీతుగా వుంది. రెండు మూడు రోజులు వూర్లో వుండాల్సి వస్తే, యెట్లా వుండాలో దిక్కు తెలీకుండా వుంది. వీరన్న యింటి పరిస్థితి చూస్తావుంటే, వాళ్ళమీద పడి తినడం ఘోరం. దాయాదే కావచ్చు. మిగతా దాయాదులున్నారు. మా నాయన బతికి వుండగా వాళ్ళతో మాకు మంచి సంబంధాలు లేవు. యీ శత్రుభావం ముదెబ్బల (ముత్తాతల) కాలం నాటినుంచీ వచ్చింది. ఆ తర్వాత బావుల్లో నీళ్ళు తగ్గుతూ వచ్చినప్పుడు నీటి వంతులకోసం వచ్చింది. తలకాయలు బద్దలు కొట్టుకోవడం దాకా రాలేదు. కానీ బావుల దగ్గర కుక్కల్లా కాట్లాడుకున్నారు. పైర్లు యెండబెట్టుకున్నారు. కాపుకు రాబోతున్న నిమ్మచెట్లను యెండబెట్టుకున్నారు. పెళ్ళిళ్ళ దగ్గరో, బావుల దగ్గరో కలిసేవారు. శుభకార్యాల బంధుత్వం. సూతకాల రక్తస్పర్శ-అంతే.మళ్ళా మామూలే. అయితే నాకున్న చదువువల్లా, వుద్యోగం వల్లా మా నాయన పోయాక నాతో పడే తగువు యేంలేదు కాబట్టి పలకరింపులున్నాయి. వూరొస్తే భోజనాలకు పిలవడాలున్నాయి. ఈ రెండు రోజులు అంగడి సుబ్బరాయుడింట్లోనే డబ్బిచ్చి భోజనం యేర్పాటు చేయించుకుందామని నిశ్చయించుకున్నాను.

అంగట్లో సుబ్బరాయుడు కూర్చొని వున్నాడు. యిల్లూ అదే, అంగడీ అదే. ఆ యింజన్ల కోసం ఒక వారగా అరుగు



మీద పెట్టిన కిరసనాయిలు డ్రమ్ముతో సహా. అంగట్లో వెయ్యి రూపాయల పెట్టుబడి వుండదు ఒంటిమీద చొక్కాలేదు. మాసి చిరిగిపోయిన పంచె కట్టుకున్నాడు. గడ్డం మాసి వుంది. మనిషి మాత్రం దరిద్రం ఓడుతున్నాడు. మలతాడుకు బీగాలు వేలాడుతున్నాయి. డబ్బు సంపాదనలో ఆ దీక్ష మానవ మాత్రులకు సాధ్యమయ్యేది కాదనీ. యోగులకు మాత్రమే సాధ్యమనీ ఆ మనిషిని చూస్తూనే, అతను సరుకులమ్మే పద్ధతిని చూస్తూనే తెలిసిపోతుంది.

నన్ను చూస్తూనే జొన్నలు పోసుకునే జాజిచెక్క పెట్టెమీద అడ్డ పలక వేసి కూర్చోమన్నాడు. పిల్లలు అయిదు పైసల పది పైసలు బేరానికి బొంగో, బీడీనో, వుప్పిరి బుడ్డో, మరొకటో చేతిలోపెడుతూ క్షేమ సమాచారాలు అడిగి నింపాదిగా అన్నాడు:

“అన్నం పెయ్యిచ్చేదా? వీరన్నింటికి పోవాలా?”

“చేయించు” అన్నాను.

లేచి యింట్లో చెప్పి వచ్చినాడు. సుబ్బరాయుడి భార్య పరామర్శ చేసి పోయింది. సుబ్బరాయుడు నెమ్మదిగా అన్నాడు:

“వీరన్న భూమిని నన్నే తీసుకోమన్నాడు.”

“వీరన్న రానీలే మాట్లాడదాం” అన్నాను.

ఈ పొడి మాటలు ఒక కొలిక్కి రాకుండానే, అంగట్లోకి మా మరో పెద్దనాయన కొడుకు మునిరెడ్డి వచ్చాడు. నన్ను చూసి నేరుగా యింటికి రాకపోయినందుకు నిష్ఠూరం చేసినాడు. “యిదుగో యిప్పుడే రాబోతున్నా” అని బొంకినా. “భోజనానికి పద” అన్నాడు. “యిప్పుదీడ దింటాడు. రాత్రికి కోడిగోసి పెట్టుదువులే” అని సుబ్బరాయుడు హాస్యానికన్నట్లు అన్నాడు. “యిప్పుడు కాఫీ అన్నా తాగొస్తువు రా” అంటూ బలవంతంగా లేవదీసినాడు.

మా మునిరెడ్డి అన్న కాఫీ యిచ్చి. రెండు గంటలు గ్రామ పరిస్థితులు, పంచాయితీ రాజకీయాలు, చదువులూ సంధ్యలూ దేశ రాజకీయాలూ అన్నీ మాట్లాడినాడు. అది పెద్ద సోది. అన్నీ తెలుసుననుకొనే వాడి సోది. ఎంతకూ నా విషయంమాత్రం అడగలేదు. నే భరించలేక నేనొచ్చిన పని చెప్పినా. ముందు భూమి నమ్ముకోదమెందు కన్నాడు. తర్వాత “జీతమంతా యేం చేస్తాండవు? యెంత మిగిలించినావు? యిన్సూరెన్సెంత?” వగైరా యక్షప్రశ్నలు వేసినాడు. మా ప్రసూన పెళ్ళి నిశ్చయమైన సంగతి చెప్పినా. పిల్లగాడి చదువు. వుద్యోగం, కట్నం అన్నీ అడిగినాడు.

“ఈ పాడు కరువులో ధర యాడ పలుకుతుంది. అంగడి సుబ్బరాయుడికి అగ్గువగా యివ్వాల్సి వుంటాదేమో” అన్నాడు.

“వీరన్న వచ్చినాకనే ఆ బేరం” అన్నాను.

అప్పుడు వీరన్న కథ చెప్పినాడు—:

“వాడు మనోళ్ళందరికీ చెడ్డ పేరు దెచ్చినాడు. వూర్లో సాటి కాపోళ్ళకు చెడ్డపేరు. మన వంశం యెట్లాంటిది? దెబ్బతినోడు దాయాదేగదా అని మనింట్లో సేద్యాని కుండమన్నా. వాడు బడాశ మనిషి. ఒప్పుకోలేదు. ఆ పనికి మాలిన కామసూరోళ్ళ మాట విని ‘బోగం కంపెనీ’లో చేరినాడు. చేరినోడు మర్యాదగా వుండినా సరిపొయ్యేది. ఆ రెండెకరాలూ అమ్మి బాకీలన్నీ పూర్తిగా దీర్చకుండా, రెండు వేలు తీసుకొని యింకెక్కడా బాగుండదని చిలకలూరి పేటకు పోయినాడంట. యిద్దరు బోగమోళ్ళను దెచ్చుకుంటే వాళ్ళు దొడ్డికి పొయ్యొస్తామని అదే పోయినారంట. వీడు అన్నెందాలాచెడిపోయినాడు.యేమయిందో యేమో తెల్దు. బొమ్మర్లతో చెడిందని అంటా వుంటారు.పోలీసోళ్ళు వొక రోజు బాగా కొట్టినారంటా వుండారు. యీ మధ్యనే వూరుచేరి సిమెంటు ఫ్యాక్టరీకి పోతండాడు. కరువులే ఒకటి అనుకుంటే యీ సిమెంట్ ఫ్యాక్టరీ వచ్చి రైతుల కొంప గూల్చింది. రోజుకు సిమెంట్ ఫ్యాక్టరీలో పదైదు రూపాయల కూలి గిట్టుతుంది. రైతును అంత యియ్యమంటే యెక్కణ్ణుంచి తెచ్చివ్వాల? యిప్పుడు అయిదు రూపాయలిచ్చినా వచ్చేవాడులేదు. ఆడోళ్ళు కూడా అక్కడకే మరిగింటే. పది రూపాయలు దొరుకుతుంది. యింక భూములన్నీ అమ్ముకోవాల్సిందే. ఈ కూలోళ్ళు, మన పక్క పల్లె కూలోళ్ళే మన భూములన్నీ కొనే రోజులు దగ్గర పడినాయి....

కూలోళ్ళు యెంత భూములు కొనిందీ మునిరెడ్డి అన్నకు తెలియంది కాదు. అంగడి సుబ్బరాయుడిలాంటి వాళ్ళు ముందు కొన్తున్నారంటే వాళ్ళు వొక రకంగా వేదాంతులు. యాభై యెకరాల మునిరెడ్డి అన్న గోడు యెట్లావున్నా, వీరన్న కథ వింటానే మనసంతా కెలికినట్లయింది. పదైదేండ్ల కిందట యిరవైయెకరాల రైతు నాకు తెలిసి ఒక్క చెడ్డ అలవాటు లేదు.

మునిరెడ్డి అన్నకు రాత్రికి మళ్ళా వస్తానని చెప్పి సుబ్బరాయుడింటికి బయలుదేరినా. దారిలో మరొక బంధువు కనపడి “వుద్యోగాలు చేసే మీ పనీ, కూలినా కొడుకుల పనీ బాగుందిరా” అన్నాడు.

యింతాచేసి ఆయనా పెద్ద రైతు కాదు. ఒకప్పుడు పెద్ద రైతు. ఆ ఒకప్పటి దర్పం యింకా చావలేను.

సుబ్బరాయుడింటికి భోజనానికివెళ్ళినా అన్నానికి కూర్చున్నాము.

"అన్నం తిని తిని నోరు చెడిపోయి వుంటుంది. సంగటే బాగుంటుందని అన్నం చెయించలా". సుబ్బరాయుడు లౌక్యం యెట్లున్నా. సంగటి నా కథం తరం లేదు. అయితే ఆ తెల్లవాయి కారం. అలవాటు తప్పిపోయింది. నెయ్యిలేదు. పల్చటి మజ్జిగ నీళ్ళు సుబ్బరాయుడు ఈ రకంగా బ్రతికితే తప్ప. భూమి పోగొట్టుకొనే వాళ్ళ భూమి కొనలేను. సుబ్బరాయుడిమీద జాలిపడాలో. సుబ్బరాయుడిలో ముందు ముందు పెద్దదయ్యే ధన దాహాన్ని చూసి అసహ్యించుకోవాలో తెలియలేను.

మధ్యాహ్నం నిద్ర అలవాటు లేదు. దేవళం దగ్గిర కాసేపు కూచుందామని పించింది. అక్కడికి వెళ్ళేతలికి, నేను పుదయం యిచ్చిన దినపత్రికనే యింకొక నలుగురుచేరి అధ్యయనం చేస్తున్నారు. దొరక్క దొరక్క దొరికిన పేపరు లాగుంది.

ఒక కుర్రవాడు వచ్చి నా పక్కన కూచున్నాడు గుర్తుపట్టినా. పుల్లమనాయుడు కొడుకు. బి.ఏ. చదువుతున్నానని చెప్పినాడు. యెవరితోనో మాట్లాడుతున్నట్లు అన్నాడు.

"కడప జిల్లాను కరువుప్రాంతంగా ప్రభుత్వ ప్రకటన. యీ కలెక్టరో. మంత్రులో ప్రకటిస్తేనే తప్ప. యిది కరువుప్రాంతం కాకుండా పోతుందా? సిగ్గూ శరమూ లేని జాతి. స్వాతంత్రం వచ్చి యిన్నేండ్లయినా మంచినీళ్ళ కరువు తీర్చలేకుండా వుంది. యింక తెలుగుదేశం పార్టీమీద అభిమానం రమ్మంటే యెందుకు రాదు. యీ సారి రైతులంతా తెలుగుదేశానికి వోట్లేస్తే తప్ప. కాంగ్రెస్‌కు బుద్ధి రాదు".

పొద్దున నా దగ్గర పేపరు అడిగి తీసుకున్న కుర్రవాడు అందుకు ఒకేమాట బదులిచ్చాడు.

"కాంగ్రెసు హిందూమతం లాంటిది. చరిత్రలో అది అన్ని మతాలను మింగి వస్తే తెలుగుదేశాన్ని. అట్లాంటి సవాలక్ష పార్టీలను మింగి కూచుంటుంది. జనతా అప్పుడు చూసినాం. యిప్పుడూ అంతే. యిప్పుడుకావలసింది మింగేపార్టీలు కాదు. మింగుడుపోయే పార్టీకాదు."

"నీ కమ్యూనిస్టు మాటలూ...."

"నీ.... మాటలు...."

తారాస్థాయి వందుకోబోతున్న వాళ్ళను యెట్లా వారించాలో తెలియలేదు. ఆ ఆవేశాల వెనుక వాళ్ళ అలజడి స్పష్టంగా కన్పిస్తోంది. అలజడే రాజకీయాలు కావని వాళ్ళకు తెలిసినట్లు నా కన్పించలేదు. కాంగ్రెసును హిందూమతంతో పోల్చిన కుర్రాడిలో మేధస్సు వుంది. నిజాయితీ వుంది. పుల్లయ్య నాయుడు కొడుకులో అది లేదు. గాలివాటం రాజకీయాలు. నా అభిప్రాయం చెప్దామనుకున్నా. సుబ్బరాయుడి కొడుకు వచ్చి "నాయన రమ్మంటుండాడు" అని పిల్చాడు.

సుబ్బరాయుడు కాఫీ కషాయం అందించి అన్నాడు:

"దేవళంలో యింతసేపూ వుండావా? అరపొద్దుపోని నాయాండ్లుచేరడం యెక్కువైంది. మరీ యీ మధ్య యీ బియ్యేలు అవీ బూములమ్మించి సదివి. వుద్యోగాల్లేక తలకాయలు చెడిపోయిన పిల్ల నాయాండ్లే అర. మట్కా ఆడడమో. వాణ్ణీ వీణ్ణీ తిడుతూ కూర్చోడమో."

సుబ్బరాయుడితో యేం వాదించేది? సుబ్బరాయుడే వాళ్ళను కాసేపు తిట్టి "మరి యేం జెయ్యాల" అన్నాడు

"వీరన్న రానీ....పోనీ నువ్వు చెప్పు. వీరన్న కిష్టమయితే భూమి తీసుకో" అన్నాను.

సుబ్బరాయుడు తను పడుతున్న కష్టాలన్నీ యేకరువూ పెట్టినాడు. నాకు డబ్బు అవసరమనే విషయం మీద సానుభూతి చూపినాడు. వూరి పరిస్థితి చెప్పినాడు. మునిరెడ్డి లాంటి వాడికే నలభైవేలు అప్పువుందని, యెవరెవరికి యెంతెంత వ్వాలో వివరించినాడు. మనూళ్ళో భూమి కొనేవాడెవరూ లేడంటూ, యెవరెవరి సంసారాలు యెట్లా వున్నాయోచెప్పినాడు. కూలోళ్ళు దొరకరని అన్నాడు. అన్నీ చెప్పి చెప్పి చివరకు అన్నాడు: 'ఆరువేల కంటే ఒక్క నయాపైసా యెక్కువ యివ్వలేను. కావాలంటే మీ మునిరెడ్డి అన్ననే అడుగు'.

పదివేలకు నాలుగేండ్లకిందట అమ్మిన భూమిని సుబ్బరాయుడు ఆరువేలకు అడిగినాడు. యిది సుబ్బరాయుడి దృష్టిలో రూపాయ విలువ యెక్కడమో. తగ్గడమో. అంతకుముందే ఒక్క ముక్క కొబ్బెర యెవరో గోజినంచుకు "ధరలన్నీ పెరిగిపోతాంటే నేనేం మొత్తు కొనేదా." అన్నవాడు. కరువూ, నా అవసరమూ భూమి విలువను తగ్గించినట్లుంది. దిక్కు తోచలేదు.

"వీరన్న రానీ, రాత్రికి మాట్లాడుకుందాం" అన్నాను.

"రానీలే తొందర యేముంది?" అన్నాడు సుబ్బరాయుడు ధీమాగా.

పొద్దుగూకింది. వీరన్న వచ్చినాడు.



కోడిగిడి అంటూ భోజనం ఏర్పాట్లు హడావిడి చేసినాడు. "మునిరెడ్డి అన్న రమ్మన్నాడన్నాను. రామలక్షుమ్మ "పేదోళ్ళింట్లో తింటావా" అంటూ నిష్ఠూరమాడింది. యేం చెప్పేది?

వీరన్నతో విషయం కదిపాను. అంతా విని నిశ్చింతగా "సుబ్బరాయునికే అమ్ము" అన్నాడు. యెక్కడో లోపల దాచిన క్రయ పత్రాన్ని తెచ్చి నా చేతి కిచ్చినాడు. నాకేం మాట్లాడాలో తోచ లేదు. ఆఖరుకు మనసు కూడగట్టుకొని తెచ్చుకొని అన్నాడు.

"ప్రసూన పెళ్ళికి నేనేదో తంటాలు పడతా. లేదా జరిగేది జరుగుతుంది. భూమి నువ్వే చేసుకో నీకు వీలున్నప్పుడే డబ్బు యిస్తువు."

"వీలేంది యెట్లా వుంటుంది వీలు? యింత సదువు సదివినోడివి. నీకేమన్నా పిచ్చా? కరువు న్నమ్ముకోమంటావా? సుబ్బరాయుని నమ్ముకోమంటావా? బావిలో వంతులేదంటే యేం జెయ్యాల? బాడుగకు యింజ నీపొద్దు ఆడించను పొమ్మంటే యేం జెయ్యాల? యెద్దుల్లేవు. యారముట్లులేవు. దేన్ని చూసుకొని భూమి తీసుకోమంటావు? భూమివి నా కమాషి వచ్చినాకే యిరవై యేండ్లు నమ్ముకున్నా మిగిలిందేముంది? యింకా సుబ్బరాయుడి కివ్వాల్సిన పద్దైదు నూర్లు.... యింకా గవర్నమెంటు లోన్లు....".

"యింకానా?"-

"ఆఁ.... యీ బాకీల్తో దిక్కుదోచకే పొద్దుటూరుకు పొయ్యింది. యే రైతూ చెయ్యనిపని చేసింవి. బోగం కంపనీలో నీళ్ళు మోసినా. బోగమోళ్ళకు అన్నం పొట్లాలు మోసినా, వాళ్ళ దగ్గరకొచ్చే వాళ్ళకు బ్రాందీలు, సారాయి తెచ్చినా. పోలీసోళ్ళకు బోగ మోళ్ళను పంపినా. దొంగ రెయిడింగుల్లో దెబ్బలు తిన్నా.... కానీ నేనే సొంత కంపెనీ పెడదామనుకున్నా .మోసపోయినా. నేను అక్కడ పనికిరానని తెల్సిపోయింది. అక్కడ వుండలేక రోజూ సిగ్గుతో సచ్చినా— తెలిసినవాడు యెవడు కనపడతాడోనని. కడకు వూరు చేరుకున్నా.... భూమి లేక పోయినా చేతుల కష్టం వుంది. యిప్పుడు ఫ్యాక్టరీ వుంది- నా లాంటోళ్ళకు చానా మందికి-"

"రెండేండ్లో మూడేండ్లోనే కదా. ఫ్యాక్టరీ కట్టేపని పూర్తి అయితే ఆ తర్వాత నీ లాంటోడికి పని వుంటుందా? అందువల్ల...."

"మళ్ళా భూమి చేసుకోమంటావు? భూమివద్దు గీమీవద్దు అసలు నీ కర్థం గాంది యింకొకటి వుంది. భూమి చేసుకుంటా ననుకో. సుబ్బరాయుడి బాకీ. గవర్నమెంటుకు బాకీ. నీకూ బాకీ. సుబ్బరాయుడు తన బాకీలోకి మళ్ళీ ఆయకం పెట్టుకుంటాడు. సొంతం చేసుకుంటాడు. సుబ్బరాయుడి బాకీ కింద నువ్వియాలనుకునే రెండెకరాలు పోతాది. నీకు నేనివ్వాల్సిన పదివేలు యిరవై వేలవుతాది. అసలు సంగతి సుబ్బరాయుడు ఆరువేల కంటె యెక్కువ పెట్టనంటున్నాడు. నువ్వేం చెయ్యలేవు. యియ్యాల్సిందే. నేను సంచకారమిచ్చిన డబ్బు నాకు దమ్మిడీ రాదు. అది సుబ్బరాయుడే పట్టుకుంటాడు. తనకు నీ వివ్వాల్సిన బాకీలోకి. మునిరెడ్డి అన్న కూడా సుబ్బరాయుడికి లోకువే కాబట్టి అన్నింటికి సై అంటాడు. నువ్వు జేసేదేముంది? నేను చేసేదేముంది? యేమంటావు?"

యేమంటాము? ఆ రాత్రే భూమి వ్యవహారం పూర్తి అయింది. మునిరెడ్డి అన్న ఒక మూడువందలు ఎక్కువకు ఫైసలు చేసినాడు. "యిప్పుడు నాలుగు వేలిస్తాను. వచ్చే మాసూల్లో రెండువేలిస్తాను. యిప్పుడే అంతా యిచ్చేవాడిని, మీ మునిరెడ్డి అన్న మరీ యిబ్బందిగా వుందంటే యిచ్చినా. యింక మూడు నెలల్లో వీరన్నకు నువ్వు యివ్వాల్సిన పదమూడు నూర్లు పట్టుకుంటా. రెండువేలా యేడునూర్లు నీకిస్తా" అన్నాడు. సరే నన్నాను.

యీ లెఖ్ఖలు తెగేవి కావు. భూమితో, మా వూరితో ఆఖరు లింకు తెగిపోయింది.

అర్ధరాత్రి దాటేవరకు వూరి విషయాలూ, ఫ్యాక్టరీ కబుర్లూ, వీరన్న ఫ్యాక్టరీ కబుర్లే యెక్కువ చెప్పినాడు. ఫ్యాక్టరీ తీసుకునే భూముల ధర విషయంలో పెద్ద మనుషులు రైతులకు చేస్తున్న మోసాల గురించి చెప్పినాడు. ఆ మధ్య అరవ కూలోళ్ళకు. తెలుగోళ్ళకు జరిగిన కొట్లాట గురించీ సమ్మె గురించీ, యీ మధ్య యేర్పడిన యూనియన్ గురించీ, కూలి పెంచమని సమ్మె గురించీ చెప్పినాడు.

తెల తెలవారుతోంది. ఫ్యాక్టరీ పనికి ప్రయాణమైపోతున్న వారి వెంట నేనూ బయలుదేరినా. నా కింకేం పని యిక్కడ? తిరుపతిలో వుండే పెళ్ళి కొడుకు వాళ్ళకు యిప్పట్లో పెళ్ళి పెట్టుకోలేమని చెప్పి హైదరాబాదు పోవామనుకున్నా.

వీరన్న ముందు నడుస్తున్నాడు. అతని వెంట యిరవై మందికి పైగా కరువు కాటకాలకు అప్పులపాలై భూమి నమ్ముకున్న రైతు జనం. కరువు భూముల్లో ఫ్యాక్టరీ దిశగా సాగిపోతూ....

పైన సిమెంటూ, ఎముకల పొడీ కలిసిన రంగులో ఆకాశం. ఆ మూల యెక్కడో యెర్రగావు.... ....